# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక :157 ప్రచురుణ : హైదరాబాద్ ఆదివారం,19-04-2026 పేజీలు: 8 వెల : 3- 00


## వరంగల్ విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన

- వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం విమానాశ్రయాల నిర్మాణంపై సమీక్ష
- వరంగల్ విమానాశ్రయం కోసం 953 ఎకరాల భూమిని కేంద్రానికి అప్పగించినట్లు వెల్లడి
- ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచన



వరంగల్ విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సచివాలయంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్‌కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి, ఇతర అధికారులతో విమానాశ్రయాల ఏర్పాటుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాల నిర్మాణంపై సమీక్ష జరిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు.త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. డిఫెన్స్, సివిల్ ఏవియేషన్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో, దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

## రేవంత్ సభను విజయవంతం చేయాలి



**సోమవారం కాటారంలో సీఎం రేవంత్ కార్యక్రమం**

**మంథని క్యాంప్ కార్యాలయంలో శ్రీధర్ బాబు సమీక్ష సమావేశం**

**కార్యక్రమంలో పాల్గొననున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల కాంగ్రెస్ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం కాటారంలో జరగనున్న ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి రైతు భరోసా పథకమే నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా బాధ్యతలను కేటాయించిన ఆయన, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను, పార్టీ శ్రేణులను కోరారు. కాటారం సభ ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటి చెప్పబోతున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సింహం బయటకు వస్తుంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతోంది




సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు.అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్విస్తున్నారని మండిపడ్డారు. కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా తవ్విస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. కాగా, ఎల్లుండి జగిత్యాలలో జరగనున్న బహిరంగ సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇవ్వకుంటే మనమే ఆక్రమించుకుందాం

**ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని కవిత డిమాండ్**

**లేదంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరిక**

**అసెంబ్లీలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీల ఊసే ఎత్తలేదని ఆగ్రహం**




తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న భూమి ఇవ్వకపోతే మనమే ఆక్రమించుకుందామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జాగృతి ఇప్పటికే ఉద్యమకారుల తరఫున ఎన్నో పోరాటాలు చేసిందని, మున్ముందు ఉద్యమకారులతో కలిసి పనిచేస్తుందని అన్నారు.

ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'చలో సెక్రటరియేట్' పేరుతో సచివాలయ ముట్టడికి బయలుదేరగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు, ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేసి సమీప పోలీస్ స్టేషన్‌లకు తీసుకువెళ్లారు. మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌లో అరెస్టైన వారిని కవిత పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా ఉద్యమకారులను జైల్లో పెట్టడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకుంటోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఉద్యమకారులకు భూమి, పెన్షన్ హామీని అమలు చేయకుంటే జాగృతి ఆధ్వర్యంలో భూపోరాటాలు చేసి భూమి ఆక్రమించుకుంటామని హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందున్నదే ఉద్యమకారులని కవిత తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని పాలించినప్పటికీ, ఉద్యమకారులకు దక్కాల్సిన గౌరవం దక్కలేదని విమర్శించారు. అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు పెన్షన్, భూమి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా హామీ నెరవేర్చకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై తెలంగాణ జాగృతి ఒత్తిడి చేస్తే, ఉద్యమకారుల బిల్లు పెడతామని హామీ ఇచ్చారని, కానీ అసెంబ్లీలో ఆ ఊసే ఎత్తకుండా మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం ఉద్యమకారులు సచివాలయాన్ని ముట్టడించే పరిస్థితి రావడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యమకారులు ధైర్యంగా ఉండాలని, మనం కొట్లాడి తెచ్చుకున్నతెలంగాణలో హక్కులు సాధించుకోవడం కష్టమేమీ కాదని అన్నారు.

## దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా

**2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ**

**మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమన్న రేవంత్ రెడ్డి**

**డీలిమిటేషన్ పేరుతో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని కుట్ర చేసిందని ఆగ్రహం**




2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే, దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లోపు నాటి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తే మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని పేర్కొన్నారు.ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోయినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోవడంతో దేశానికి పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు.ఎన్డీయే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని అన్నారు. మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని అన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు.సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే పెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య చిచ్చుపెట్టవద్దని ముఖ్యమంత్రి కోరారు. డీలిమిటేషన్ పేరుతో లోక్ సభ సీట్లను 850కి పెంచి బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే కుట్ర చేసిందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందిరాగాంధీ వంటి గొప్ప నేతలు కాంగ్రెస్ పార్టీ తరఫున దేశాన్ని నడిపించారని, బీజేపీ నుంచి ఇప్పటి వరకు మహిళ పార్టీ అధ్యక్షురాలు కాలేదని విమర్శించారు. ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

# బీజేపీని ముంచేస్తున్న సొంత నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 18,**
తెలంగాణ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదగాలని కలలు కంటున్న భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు బయటి ప్రత్యర్థుల కంటే లోపలి శత్రువులే ఎక్కువయ్యారు. కొత్త రక్తాన్ని ఎక్కించుకుని పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన సమయంలో.. కొందరు నేతలు చేరికలకు బ్రేక్ వేస్తున్నారు. కొత్త వాళ్లు వస్తే తమ ఉనికికి ఎక్కడ ముంపు ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. దీంతో నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి.రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు పగ్గాలు చేపట్టినప్పటి నుండి పార్టీని ఒకతాటిపైకి తెచ్చేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఆయన నిరంతరం జిల్లాల్లో పర్యటిస్తూ, కార్యకర్తలను కలుస్తూ పార్టీలో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో అధ్యక్షుడు పడుతున్న కష్టానికి ఇతర ముఖ్య నాయకుల నుండి ఆశించిన మద్దతు లభించడం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీని తమ సొంత సంస్థగా భావించి పని చేయాల్సిన అగ్ర నేతలు, కేవలం తమ వ్యక్తిగత అజెండాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనివల్ల సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఏ పార్టీలోనైనా పాత వారు, కొత్తగా వచ్చిన వారి మధ్య చిన్నపాటి ఘర్షణలు సహజం. కానీ తెలంగాణ బీజేపీలో ఈ అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఇతర పార్టీల నుండి వచ్చిన సీనియర్ నేతలకు, పార్టీని నమ్ముకున్న పాత కాపులకు మధ్య సయోధ్య కుదరడం లేదు. బయటకు అందరూ నవ్వుతూ కనిపిస్తున్నా, లోపల మాత్రం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, ఎదుటివారిని తక్కువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కవరింగ్ రాజకీయాల వల్ల పార్టీ ఎదుగుదల కుంటుపడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణలో రాజకీయ పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని భావించి, కాషాయ తీర్థం పుచ్చుకోవాలని భావిస్తున్న పెద్ద తలకాయలు ఇప్పుడు వెనకడుగు వేస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పార్టీలో ఉన్న నేతలేనని తెలుస్తోంది. ఎవరైనా కొత్త నేతలు పార్టీలోకి వస్తామంటే, ప్రస్తుతం ఉన్న నాయకులు వారిని ప్రోత్సహించాల్సింది పోయి, "మాకే దిక్కు లేదు, మమ్మల్ని ఇక్కడ ఎవరూ గౌరవించడం లేదు, మీరు వచ్చి ఏం చేస్తారు?" అంటూ భయపెట్టి నిరుత్సాహపరుస్తున్నారట. ఈ పరిస్థితి వల్ల పార్టీలోకి రావాలనుకున్న వారు పెనం మీద నుంచి పొయ్యిలో పడటం ఎందుకని భావిస్తూ ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు.బీజేపీలో నెలకొన్న ఈ వింత పరిస్థితికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఉదాహరణగా నిలుస్తున్నారు. ఆయన బీజేపీలో చేరడం ఖాయమని, కేవలం ముహూర్తం మాత్రమే బాకీ ఉందని పార్టీ నేతలే స్వయంగా ప్రచారం చేశారు. కానీ అనూహ్యంగా ఆయన కమలాన్ని కాదని గులాబీ గూటికి చేరుకున్నారు. ఆయన పార్టీ మారడానికి బీజేపీలోని అంతర్గత కుమ్ములాటలు, నాయకుల మధ్య
ఉన్న విభేదాలే ప్రధాన కారణమని ఇప్పుడు పార్టీలో చర్చ మొదలైంది. ఒక సీనియర్ నేతను కూడా పార్టీలోకి ఆహ్వానించి, నిలబెట్టుకోలేని స్థితిలో తెలంగాణ బీజేపీ ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇతర రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని చేర్చుకుని, వారికి ఉన్నత పదవులు ఇచ్చి పార్టీని అధికారంలోకి తెస్తున్న హైకమాండ్ వ్యూహాలు తెలంగాణలో మాత్రం రివర్స్ అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో క్యాడర్ సిద్ధంగా ఉన్నా, నాయకుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల పార్టీకి నష్టం జరుగుతోంది. ఇప్పటికైనా అగ్ర నాయకత్వం జోక్యం చేసుకుని ఈ అంతర్గత విబేధాలను పరిష్కరించకుంటే, అధికారంలోకి రావాలన్న కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

## జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర



**ధర్మపురి, ఏప్రిల్ 18 :** జనగామ ఎమ్మెల్యే, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని ఆరోపించారు. కేసీఆర్ పాలనే బాగుందని, ఆయన మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో కేసీఆర్ నిర్వహించనున్న సభతో బీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలవుతుందని, ప్రతి గ్రామం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆయన జగిత్యాల నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు నిర్వహించి, కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు.

## కొత్తపల్లిలో డ్రైనేజీ పనులు ప్రారంభించిన సర్పంచ్

**పెద్దపల్లి, ఏప్రిల్ 18** పెద్దపల్లి జిల్లా, కాల్వ శ్రీరాంపూర్ మండలం, శనివారం రోజున మీర్జంపేట గ్రామంలోని కొత్తపల్లిలో జెండా గద్దె నుండి ఎర్రగుంట చేరువు వరకు సర్పంచ్ పోశాల శైలజ-సదానందం గౌడ్, వార్డు సభ్యులతో కలిసి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గొర్రె సుమలత-హృదయ్ కుమార్, గోపు హేమలత-కొమురయ్య, గ్రామస్తులు పులి చంద్రయ్య, గోపు కనకయ్య, పుప్పాల రవి, గడవేనా చంద్రమోగిలి, కేశవేనా సాగర్, గోపు సారయ్య, దానపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా ద్వారా 62 మందికి ఉద్యోగాలు

**మంథని, ఏప్రిల్ 18 :** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జరిగిన ఈ మేళాలో 380 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 62 మంది ఎంపిక కాగా, మరో 9 మంది షార్ట్‌లిస్ట్ అయ్యారు. జాబ్ మేళాల ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, నిరుద్యోగులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు సూచించారు.

## బీఆర్ఎస్ నాయకుల ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన

**రామగుండం, ఏప్రిల్ 18 :** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ లో ఎంపీడీవో రామ్మోహన్ ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి పాలన మండల సభలో మాజీ ఎంపీపీని స్టేజ్ మీదకు పిలవడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ప్రకారం అందరినీ పిలవాలని, అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతి రెడ్డి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పినపాక, ఏప్రిల్ 18 :** రాత్రి అశ్వాపురం మండలంలోని నెల్లిపాక గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తుమ్మల చెరువు గ్రామానికి చెందిన కొమరం మహేష్ (30) మృతి చెందారు. ఆయన తన స్వగ్రామం నుండి భద్రాచలం వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## గొర్రెలు పై దూసుకు వెళ్లిన కోళ్ల వ్యాన్

**కొత్తగూడెం, ఏప్రిల్ 18 :** మణుగూరు సీఎస్పీ సమీపంలో శనివారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో రోడ్డుపై గొర్రెలను మేపుకుంటూ వెళ్తుండగా, వేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్ అదుపుతప్పి గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో సుమారు 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంతో గొర్రెల యజమానికి భారీ నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న స్థానికులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

## అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ని ఆకస్మిక ఐజీ

**అశ్వారావుపేట, ఏప్రిల్ 18 :** తెలంగాణ మల్టీజోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, రికార్డులను పరిశీలించిన ఆయన, ఇటీవల పెరిగిన రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎస్పీ రోహిత్ రాజ్ తదితరులు ఉన్నారు.

# రక్తసంబంధం వర్సెస్ రాజకీయ పంతం

**హైదరాబాద్, ఏప్రిల్ 18, :** రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ రాజకీయాలు ఇప్పుడు ఒకే రకమైన వారసత్వ యుద్ధం చుట్టూ తిరుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నా.. అగ్రనేతల కుటుంబాల్లోని అన్నాచెల్లెళ్ల మధ్య తలెత్తిన విభేదాలు పార్టీల ఉనికిని, ఉమ్మడి ఓటు బ్యాంకును ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ , తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి ఎదుర్కొంటున్న ఈ చిత్రమైన పరిస్థితులు
ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యను పరిష్కారం చేసుకోవడం వారి వల్ల కావడం లేదు. తెలుగు రాజకీయాల్లో వైఎస్సార్, కేసీఆర్ కుటుంబాలకు ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్న వెన్నంటి నిలిచిన చెల్లెళ్లు, ఇప్పుడు అదే అన్నలకు రాజకీయంగా సవాల్ విసురుతున్నారు. ఏపీలో వైఎస్ జగన్ జైలులో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసి పార్టీని కాపాడితే, తెలంగాణలో ఉద్యమ సమయంలో కవిత సాంస్కృతిక సారథిగా నిలిచారు. అయితే, నేడు ఏపీలో జగన్-షర్మిల మధ్య ఆస్తుల గొడవలు, రాజకీయ విభేదాలు బహిరంగమై కోర్టుల వరకు వెళ్లగా.. తెలంగాణలో కేటీఆర్-కవిత మధ్యఆధిపత్య పోరు .. కవిత సొంత పార్టీ దిశగా వెళ్లింది. వైసీపీలో జగన్, షర్మిల మధ్య పోరు కేవలం రాజకీయమైంది మాత్రమే కాదు, కుటుంబ ఆస్తుల పంపకాల్లో తలెత్తిన విభేదాలు కూడా దీనికి ఆజ్యంపోశాయి. తల్లి విజయమ్మ కూడా షర్మిల పక్షాన నిలబడటం పార్టీ కేడర్‌లో అయోమయాన్ని సృష్టించింది. అటు బీఆర్ఎస్‌లోనూ కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం జరిగిన ప్రతిసారీ కవిత వర్గంఅసంతృప్తి వ్యక్తం చేయడం, తాజాగా ఆమె కొత్త పార్టీ పెట్టబోతూండటం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ సభ్యుల మధ్య ఉండే రహస్యాలు, లోపాలు రాజకీయ ప్రత్యర్థులకు బలమైన అస్త్రాలుగామారుతున్నాయి. ఏపీలో షర్మిల చేసే విమర్శలను టీడీపీ, జనసేన తమకు అనుకూలంగా మలుచుకుం టుంటే.. తెలంగాణలో కవిత అరెస్ట్ లేదా ఆమెపై వచ్చే ఆరోపణలను కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్ , ప్రస్తుత పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి వాడుకుంటున్నాయి. "ఇంటిని చక్కదిద్దుకోలేని వారు రాష్ట్రాన్ని ఏం చక్కదిద్దుతారు అనే విమర్శలను ఈ రెండు పార్టీలు ఎదుర్కోవాల్సి వస్తోంది.ప్రాంతీయ పార్టీలు ప్రధానంగా ఒక బలమైన నాయకుడి చుట్టూ, ఆ కుటుంబం చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. అన్నాచెల్లెళ్లు విడిపోవడం వల్ల ఆ కుటుంబానికి ఉన్న సింపతీ ఓటు బ్యాంకు రెండుగా చీలిపోతుంది. ఏపీలోవైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు జగన్, షర్మిల మధ్య నలిగిపో తుంటే.. తెలంగాణలో కేసీఆర్ వారసులుగా కేటీఆర్, కవితలో ఎవరిని నమ్మాలో తెలియక కేడర్ నిరాశలో ఉంది. ఈ చీలిక అంతిమంగా అధికార పక్షాలకు వరంగా మారుతోంది. నేతల మధ్య గొడవలు కేవలం పైస్థాయిలోనే ఉండవు, అవి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు చేరుతాయి. వారసత్వ పోరు ఎప్పుడూ ప్రాంతీయ పార్టీల బలహీనతకే దారితీసింది. అన్నాచెల్లెళ్ల ఈ సవాళ్లు సద్దుమణగకపోతే.. రెండు రాష్ట్రాల్లోనూ బీఆర్ఎస్, వైసీపీలు తమ ఉనికిని కాపాడుకోవడం కష్టతరమే. కుటుంబాల్లోని చిచ్చు.. రాజకీయంగా ప్రత్యర్థులకు పెరటిలో పండగలా మారుతుందనడం లో సందేహం లేదు.

# పాకిస్తాన్ లో రోజు ధురంధర్ సినిమానే...

**లాహోర్, ఏప్రిల్ 18, :**
ఎవరో వస్తున్నారు.. అందరూ చూస్తుండగానే కాల్చి చంపేసి వెళ్తున్నారు. క్షణంలోనే ఇదంతా జరిగిపోతోంది. చనిపోయిన వాళ్ళు అమాయకులు కాదు. గొప్ప గొప్ప మేధావులు అంతకంటే కాదు. వారంతా ఉగ్రవాదులు. వారి నర నరాన ఉగ్రవాదాన్ని జీర్ణించుకున్నవారు.. చాందస తత్వాన్ని ఒంట పట్టించుకున్న వారు.. విద్రోహ చర్యలకు పాల్పడుతూ.. భారతదేశంలో అశాంతిని కలుగజేసిన ముష్కరులు.. అటువంటివారు ఒక్కొక్కరుగా కన్నుమూస్తున్నారు.తదేగా పాకిస్తాన్లో లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన కో ఫౌండర్ అమీర్ హంజా పై పాకిస్తాన్లో కాల్పులు జరిగాయి. దీంతో అతడు కన్నుమూశాడని వార్తలు వచ్చాయి. తీవ్రంగా గాయాలు కావడంతో.. అతడిని ఎక్కడికి తీసుకెళ్లారు.. అతడు ఏమైపోయాడు అనే అంశాలపై ఇంతవరకు క్లారిటీ రాలేదు.. కాకపోతే పాకిస్తాన్లో అమీర్ చాలా సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. అతనికి అక్కడి ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. పేరు మోసిన ఉగ్రవాద సంస్థకు సహ వ్యవస్థాపకుడిగా ఉన్న అతడు పాకిస్తాన్లో స్వేచ్ఛగా తలదాచుకోవడం భారత ఆరోపణలకు బలంచేకూర్చుతోంది. పాకిస్తాన్లో ప్రపంచంలో అత్యంత తీవ్రమైన ఉగ్రవాద సంస్థలకు నాయకత్వం వహిస్తున్నవారు నివాసం ఉంటున్నారు. అనేక ఆధారాలతో భారత్ దీనిని నిరూపించినప్పటికీ అమెరికా, చైనా మోకాలడ్డుతున్నాయి.పాకిస్తాన్లో తలదాచుకుంటున్న ఉగ్రవాదులు ఇటీవల కాలంలో వరుసగా కన్నుమూస్తున్నారు. మూడు సంవత్సరాలుగా లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్ బుల్ ముజాహిద్ వంటి ప్రమాదకరమైన గ్రూపులకు సంబంధించిన ఉగ్రవాదులను గుర్తు తెలియని వ్యక్తులు పాకిస్థాన్ లో మట్టుపెట్టారు.. జైషే మహమ్మద్ ఉగ్రవాద గ్రూపుకు చెందిన మహమ్మద్ తాహిర్ అన్వర్, లష్కరే తోయిబా ఉగ్రవాద గ్రూప్నకు చెందిన ఖతల్, కలుస్తాను కమాండో ఫోర్స్ చీఫ్ పరంజిత్ సింగ్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది పాకిస్థాన్ లో కాలగర్భంలో కలిసిపోయారు. ప్రమాదకరమైన ఉగ్రవాదులను అజ్ఞాత వ్యక్తులు చంపుతున్న తీరు చూస్తుంటే అది ముమ్మాటికి దురంధర్ సినిమాను గుర్తు చేస్తోంది. ఆ అజ్ఞాత వ్యక్తులు ఎవరు? వారి వెనుక ఉన్నది ఎవరు? పాకిస్తాన్లో ఎలా ప్రవేశించారు?ఉగ్రవాదులను ఎలా చంపుతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. దాని వెనుక ఉన్నది ఎవరనే విషయాన్ని ప్రముఖంగా వివరించాల్సిన పని కూడా లేదు.ఉగ్రవాదులను ఇలా ఏరి వేయడం వల్ల భారత్ ఊపిరి పీల్చుకుంటున్నది. గతంతో పోల్చి చూస్తే ఉగ్రవాదుల రాకపోకలు తగ్గిపోయాయి. సరిహద్దుల్లో భారత్ అత్యంత కట్టుదిట్టంగా పహారా కాస్తోంది. ఉగ్రవాదుల అలికిడి కనిపిస్తే చాలు మన సైన్యం దాడులు చేస్తోంది. ఏకపక్షంగా దూసుకుపోయి.. మరోసారి భారత్ మీద దాడి చేయాలని ఆలోచనను తుంచేస్తోంది.. ఒకప్పటి మాదిరిగా పాకిస్తాన్ దేశానికి భారత్ భయపడడం లేదు. చర్చల పేరుతో కాలయాపన చేయడం లేదు. గన్నుకు గన్ను.. తూటాకు తూటా.. ప్రాణానికి పదులకొద్దీ ప్రాణాలు అనే సూత్రాన్ని అమలు చేస్తోంది. అందువల్లే ఉగ్రవాదుల అసలు రంగు బయటపడుతోంది.

# ప్రాణాలు తీస్తున్న స్లీపర్ బస్సులు



**హైదరాబాద్, ఏప్రిల్ 18,**
హైదరాబాద్ మహానగరంలో నడి రోడ్డుపై స్లీపర్ బస్ తగలబడిపోయింది. ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటే కూకట్‌పల్లి- కేపీహెచ్‌బీ రహదారిపై ఈ దుర్ఘటన జరిగింది. ఇది ప్రయాణికులను, స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. ఈ ఘటన కేవలం ఒక ప్రమాదంగానే కాకుండా దేశంలో నడుస్తున్న స్లీపర్ బస్‌ల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. శుక్రవారం రాత్రి మియాపూర్ నుంచి పాలకొల్లుకు బయల్దేరిన శ్రీ దుర్గా మహేశ్వరి ట్రావెల్స్ కు చెందిన ఏసీ స్లీపర్ బస్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కేపీహెచ్‌బీ పరిధిలోని పద్మావతీ ప్లాజా బస్ స్టాప్, మెట్రో పిల్లర్ 734 సమీపంలోకి రాగానే బస్ డ్రైవర్ క్యాబిన్ నుంచి దట్టమైన పొగలు రావడం గమనించాడు. వెంటనే డ్రైవర్, సహాయకుడు అప్రమత్తమయ్యారు. బస్‌ను పక్కకు నిలిపివేసి అందులోని 18 మంది ప్రయాణికులను వెంటనే కిందకు దించేశారు. ప్రయాణికులు కిందకు దిగిన కొద్ది నిమిషాల్లోనే మంటలు బస్ అంతటా వ్యాపించి, వాహనం పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేసినప్పటికీ బస్ పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినప్పటికీ బస్ అస్తిపంజరంలా మారిపోయింది. ప్రాథమిక సమాచారం మేరకు ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ లేదా ఏసీ యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలే ఈ ప్రమాదానికి కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా స్లీపర్ బస్‌ల డిజైన్‌పై తీవ్ర విమర్శలు ఉన్నాయి. వీటిని కొన్ని దేశాలు డెత్ బస్‌లుగా అభివర్ణిస్తారు. స్లీపర్ బస్సుల్లో బెర్త్‌ల మధ్య ఉండే గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉంటాయి. ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు త్వరగా బయటకు రావడానికి వీలుపడదు. సాధారణ బస్సులతో పోలిస్తే స్లీపర్ బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు అందుబాటులో ఉండం తక్కువ. పైగా ఉన్న ఎగ్జిట్‌లు కూడా బెర్త్‌ల వల్ల మూసుకుపోయే అవకాశం ఉంది. కూకట్‌పల్లి ఘటనలో డ్రైవర్ అప్రమత్తమవ్వడం, ప్రయాణికులు మెళకువగా ఉండటం వల్ల పెను ప్రమాదం తప్పింది. కాని గతంలో జరిగిన ప్రమాదాలు చూస్తే ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటం వల్లఏదైనా జరిగితే వెంటనే స్పందించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. పై బెర్త్‌ల నుంచి కిందకు దిగి బయటకు రావడం అత్యవసర సమయంలో కష్టమవుతుంది. భారత్‌లో స్లీపర్ బస్సులు విరివిగా
వాడుకలో ఉన్నప్పటికీ అనేక అభివృద్ధి చెందిన దేశాలు వీటిని నిషేధించాయి. చైనా ప్రభుత్వం వీటిని 2012లోనే నిషేధించింది. ఉత్పత్తి, రిజిస్ట్రేషన్లపై పూర్తిగా బ్యాన్ వేశారు. 2012, 2011లో
జరిగిన ఘోర ప్రమాదాల్లో దాదాపు 77 మంది చనిపోయారు. దీంతో చైనా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జర్మనీలో కూడా 2006 నుంచి స్లీప్ కోచ్‌లను నిషేధించారు. బస్ కదులుతున్నప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అక్కడి రూల్. అయితే స్లీపర్ పొజిషన్‌లో అది వీలుపడదని తేలడంతో బ్యాన్ వేశారు యూకేలో 2000 నుంచి నిషేధం ఉంది. కేవలం కొన్ని ప్రత్యేక టూరిస్ట్ కోచ్‌లకు మాత్రమే పరిమిత అనుమతి ఉంది. వియత్నాంలో పూర్తిగా నిషేధం లేకపోయినా కొండ ప్రాంతాల్లో, కొన్ని ప్రధాన
హైవేలపై స్లీపర్ బస్‌ల రాకపోకలపై కఠిన ఆంక్షలు విధించారు. భారత్‌లో చాలా ప్రాంతాల్లో స్లీపర్ బస్‌లు ప్రమాదాల బారిన పడుతున్నాయి. రోజూ ఏదో ప్రాంతంలో స్లీపర్ బస్‌లు ప్రమాదానికి గురి అవుతున్న వార్తలు చూస్తున్నాం. మేజర్ యాక్సిడెంట్ జరిగినప్పుడు అధికారులు, ప్రభుత్వాలు హడావిడి చేయడమే తప్ప వాటిపై సీరియస్‌గా చర్యలు తీసుకున్న ఒక్క ఘటన కూడా లేదు. దీంతో ఉల్లంఘనలు, ప్రమాదాలు సర్వసాధారణమైపోయాయి. పీహెచ్‌బీ ఘటనలో 18 మంది ప్రాణాలతో బయటపడటం కేవలం డ్రైవర్ సమయస్ఫూర్తి వల్ల జరిగిన అదృష్టం మాత్రమే. కానీ ప్రతి సారీ అదృష్టం తోడు ఉండకపోవచ్చు. అందుకే ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని సరైన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి.ఏప్రిల్ 18: (న్యూస్ ఇండియా ప్రతినిధి కే. వినోద్ కుమార్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం లో భాగంగా రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో"ూతీతీఱఙవ-ూశ్రీఱఙవ అనే థీమ్ తో ఏప్రిల్ 13 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా భద్రత అవగహన మరియు అమలు కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ వారి ఆధ్వర్యంలో ఈ రోజు మాదాపూర్ డివిజన్ పరిధిలోని బుట్ట కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీ రితీ రాజ్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ హన్మంత రావు ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేకర్ రెడ్డి మాదాపూర్ శ్రీధర్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించిన పీఏసీ చైర్మన్

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖతీతీఱఙవ-ూశ్రీఱఙవ అనే థీమ్ నినాదం గమ్యస్థానానికి చేరుకోవడం" లేదా "జీవించి చేరుకోవడం" అని అర్థం. ఇది ప్రధానంగా రోడ్డు భద్రత (రోడ్ సేఫ్టీ) కోసం ఉపయోగించే నినాదం. వేగం, మద్యం మత్తు, మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగే మరణాలను తగ్గించి, వాహనదారులు సురక్షితంగా ఇంటికి చేరుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు . ఈ కార్యక్రమంలో సిఐ కృష్ణ ప్రసాద్, సిఐ సురేష్, సిఐ శ్రీధర్ మరియు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఏప్రిల్ 20 దరువు జాతరను విజయవంతం చేయండి ఎమ్మెల్సీ విజయశాంతి,మల్లు రవి,.....



**హైదరాబాద్ ఏప్రిల్18 (న్యూస్ ఇండియా ప్రతినిధి)** దరువు తెలంగాణ సాంస్కృతిక చైతన్య వేదిక ఏర్పడి నేటికీ 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఈనెల 20 తారీఖున రవీంద్రబారతి లో జరిగే


దరువు జాతరను వేలాదిగా కళాకారులు తరలివచ్చి విజయవంతం చేయవలసిందిగా తెలంగాణ ఉద్యకారురాలు ఎమ్మెల్సీ విజయశాంతి, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మల్లు రవి పిలుపునిచ్చారు. తన నివాసం లో దరువు కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దరువు వ్యవస్థాపకులు దరువు ఎల్లన్న, దరువు రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కోఆర్డినేటర్ గా (పల్నాడు , బాపట్ల, ప్రకాశం) మాజీమంత్రి , శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ లో పదవి



**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని టిడిపి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుని తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ కేక్ కట్ చేసి, శాలువాలతో సత్కరించి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ కె కరిముల్లా , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యూనిట్ ఇంచార్జ్ టిడిపి సత్యం, కొమరవెల్లిపాడు సొసైటీ మాజీ చైర్మన్ తోట బ్రహ్మ స్వాములు, దేవిరెడ్డి భాస్కరరావు, తోట మురళి, తోట గోపాల్, తోటరామయ్య, మండల నేని సాంబయ్య, దేవి రెడ్డి శ్రీను, మండలనేని రామ కోటేశ్వరరావు, విడదల సాంబయ్య తదితరులు పాల్గొని శాలువాతో సత్కరించి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ



**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని కాకతీయ కళ్యాణ మండపం నందు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

దేశంలో క్రమశిక్షణ అంకితభావం కలిగిన శ్రేణులు తెలుగుదేశం పార్టీ సొంతం

ఐకమత్యంగా పనిచేసి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదాం

స్థానిక సంస్థాగత ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి

అత్యధిక కార్యకర్తలు ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ

100 రూపాయల సభ్యత్వంతో ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు మంత్రివర్యులు నారా లోకేష్ కల్పించారు

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తున్న కార్యకర్తల కృషిని శాసన సభ్యులు కన్నా ప్రశంసించారు. మీరు ఇదే ఉత్సాహంతో నిరంతరం ప్రజాసేవలో ముందుండి, మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఐకమత్యంగా పనిచేసి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదాం

స్థానిక సంస్థాగత ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి

అమరావతి రాజధాని రావటంతో మన భూముల విలువలు పెరిగాయి

గత ప్రభుత్వంలో రాజధాని ఎక్కడ అంటే పేరు చెప్పే పరిస్థితి కూడా లేదు

దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుంది

ప్రజలకు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా 15 వేల రూపాయలు చొప్పున వేసాము

గత ప్రభుత్వంలో అమ్మ ఒడి అందరికి ఇస్తామని మోసం చేసి ఒకరికే పరిమితం చేశారు

అన్నదాత సుఖీభవ మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాము

ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ. 20 వేలు.

కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుంటే జగన్ వాటిని చూసి ఓర్వలేక విషప్రచారాలు చేస్తున్నాడు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా కాంటీన్లు పునరుద్ధరణ యువతకు ఉద్యోగాలు హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

జగన్ హయంలో రాక్షస అరాచక పాలన సాగింది

జరిగిన ఎన్నికల్లో ప్రజలు జగన్ కి బుద్ధి చెప్పిన సిగ్గు రాలేదు

కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి చూసి ఓర్వలేక జగన్ విషప్రచారాలు చేస్తున్నాడు

ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించండి:డిఎస్పీ

కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ - అలైవ్



**కొత్తగూడెం (న్యూస్ ఇండియా ప్రతినిధి)ఏప్రిల్ 18:** త్రీ టౌన్ పోలీసులు శనివారం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో వాహనదారులకు వినూత్నంగా అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొత్తగూడెం తిరిగి టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ పాల్గొన్నారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాలలో భాగంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి నిర్వహిస్తున్న అరైవ్ - అలైవ్ ప్రోగ్రాంలో వాహనదారులకు స్వీట్లు,పండ్లు పంపిణీ చేసి రోడ్డు భద్రత నియమాలను పాటించాలని త్రీ టౌన్ పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా డిఎస్పి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలలో మరణించే వారి కంటే రోడ్డు ప్రమాదాలలో మరణించే వారి సంఖ్య పెరుగుతుందని అన్నారు.రోడ్డు భద్రత నియమాలను పాటించడంలో ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని కోరారు.హెల్మెట్,సీటు బెల్ట్ ధరించడం వలన ప్రాణాలను కోల్పోకుండా ప్రమాదాల నుండి బయటపడవచ్చని సూచించారు.ప్రజల భద్రత,శ్రేయస్సు కోసమే పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి బాధ్యతగల పౌరులుగా మెలగాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి,ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిబట్లలో "అరైవ్ అలైవ్" అవగాహన సదస్సు..



**రంగారెడ్డి జిల్లా, ఆదిభట్ల, ఏప్రిల్ 18, న్యూస్ ఇండియా ప్రతినిధి:** రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు పోలీసులు ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" అవగాహన సదస్సు శనివారం ఆదిబట్లలోని టీసీఎస్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు పోలీస్ లా అండ్ ఆర్డర్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఐపీఎస్, శంషాబాద్ జోన్ డీసీపీ బి. రాజేష్, ఆదిబట్ల ఏసీపీ డి.వి. ప్రదీప్ కుమార్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి. రవి కుమార్, ఆర్‌జీఐ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ మరియు నార్కోటిక్స్ దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రతి రోజు వాహనం పరిస్థితిని తనిఖీ చేసుకోవడం, రక్షణాత్మక డ్రైవింగ్ అలవాటు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో అప్రమత్తతే ప్రాణ రక్షణకు మూలమని పేర్కొన్నారు. ప్రమాదాల అనంతరం ప్రాణాలను కాపాడటంలో "గోల్డెన్ అవర్" అత్యంత కీలకమని వివరించిన అధికారులు, ఆ సమయంలో తక్షణ సహాయం అందించడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చని చెప్పారు. అలాగే సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపోయిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం ఆరోగ్యాన్ని, జీవితాన్ని నాశనం చేస్తుందని హెచ్చరిస్తూ, యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి, హెల్మెట్ ధరించాలి, మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ నిరసన..

రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం..



**రంగారెడ్డి జిల్లా, తుర్కయంజాల్, ఏప్రిల్ 18, న్యూస్ ఇండియా ప్రతినిధి:**తుర్కయంజాల్ అంబేద్కర్ చౌరస్తాలో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కూటమి వ్యతిరేకించడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. జీహెచ్ఎంసీ 53, 56 డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి నిరసనకారులను అడ్డుకుని పలువురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎలిమినేటి నరసింహా రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లతో 'మహిళా నేతృత్వంలో అభివృద్ధి'కి మార్గం సుగమం చేస్తుంటే, కాంగ్రెస్, 'ఇండి' కూటమి కావాలనే అడ్డంకులు సృష్టిస్తూ మహిళా వ్యతిరేక ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మహిళా ద్రోహులని తీవ్రంగా మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ కూటమి విషం కక్కిందని, దేశవ్యాప్తంగా మహిళలను అవమానించినట్టేనని అన్నారు. ప్రతి తల్లి, అక్కా, చెల్లికి ఇది అవమానకరమైన రోజని వ్యాఖ్యానించారు. త్వరలోనే మహిళలంతా కలిసి కాంగ్రెస్ కూటమికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. డీలిమిటేషన్ పేరుతో బిల్లును నిలిపివేయడం మహిళా హక్కులకు ఘోర అవమానమని, కొన్ని కుటుంబాలకు మాత్రమే పదవులు పరిమితం చేయాలనే కాంగ్రెస్ ధోరణి స్పష్టమవుతోందని ఆరోపించారు. బీజేపీకి మైలేజీ రావొద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కలిసి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొత్త రామ్ రెడ్డి, బచ్చిగాళ్ల రమేష్, తూళ్ల నరసింహ గౌడ్, కొంద్రు పురుషోత్తం, బల్‌దేవ్ రెడ్డి, కారడి శ్రీలత అనిల్, లక్ష్మి, బిక్షపతి, మల్లెల ప్రేమ్, కొలన్ రవీందర్ రెడ్డి, నందగిరి సురేష్, గుండా కృష్ణ, కంచమోని దాసు, ధారా వెంకటేష్, నాగరాజు, మారగోని విశాల్, కొమ్మం శివ తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న శ్రీ భువనేశ్వరి పీఠాధిపతులు



**వరంగల్ సిటీ బ్యూరో. న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును ఈ రోజు ఉదయం గన్నవరం శ్రీ భువనేశ్వరి పీఠాధిపతులు శ్రీశ్రీ కమలానంద భారతి స్వామివారు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన స్వామిజీ కి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఒ చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యమ్ ధర్మకర్తలు శ్రీమతి మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, శ్రీ అనంతుల శ్రీనివాస్ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలు, వేదస్వస్తితో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ కమలానంద భారతి స్వామివారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ మహామండపంలో స్వామివారు భక్తులకు తమ అనుగ్రహ భాషణం అందిస్తూ యావద్భారత దేశానికి ఏకశిలా నగరం తలమానికమని విద్యారణ్యులు జన్మించిన ఈ నేలపై జన్మించడం వరంగల్ ప్రజల భాగ్యమని ప్రపంచానికి నాగరికతను నేర్పిన భారత దేశానికి వరంగల్ ఆయువుపట్టని తెలుపుతూ విదేశీయుల పాలనలో పేరు మార్చబడిన నగరాలని తమతమ నగరముల పూర్వ నామాలను పునరుద్ధరించుకుంటున్నాయని అలాగే వరంగల్ నగరాన్ని ఏక శిలానగరంగా పేరు మార్చడానికి ప్రజలు నడుం బిగించాలని కోరారు. అనంతరం వందలాదిగా విచ్చేసిన భక్తులకు స్వామివారి హస్తముల మీదుగా ప్రసాదం అందజేశారు హిందువులలో సమస్త వర్ణములవారిని ఆలయ బ్రహ్మోత్సవాలలో యాజమాన్యం పొందేలాగ ఆలయ అధికారులు అన్వయించడంపై తమ హర్షం వెలుబుచ్చారు. ఈశ్వరుడి సృష్టిలో ఒకరు ఎక్కువ ఒక్కడు తక్కువ కాదని విదేశీయులు చెప్పే వక్రభాష్యాలకు ఇది ఒక గుణపాఠంగా నిలుస్తుందని చెప్పారు.

అనంతరం దేవాలయమును వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి. ఆలయానికి విచ్చేసి రేపటి నుండి 10 రోజుల పాటు నిర్వహింపబడే శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా బ్రహో?మూత్సవాలకు సంబందించిన వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్తలకు ఆలయాన్ని సందర్శించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు సూచనలు జారీచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందవలసినదిగా ఎమ్మెల్యే శ్రీ రాజేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు ధర్మకర్తలు శ్రీ గాదె శ్రవణ కుమార్ రెడ్డి, శ్రీ పాలడుగుల ఆంజనేయులు పర్యవేక్షకులు శ్రీ కాంతికుమార్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం కాంగ్రెస్ నాయకులు శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి ఆలయాన్ని సందర్శించే భక్తుల నిమిత్తం దేవాలయ ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.

# బారీగా రేషన్ బియ్యం పట్టివేత..

- ఆకస్మిక దాడుల్లో 1012 బస్తాలు స్వాధీనం..
- కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక..



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 18, న్యూస్ ఇండియా ప్రతినిధి:**రంగారెడ్డి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందాపై సివిల్ సప్లై అధికారులు ఉక్కుపాదం మోపారు. పెద్ద గోల్కొండలోని బియ్యం గోదాములపై నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో భారీగా రేషన్ బియ్యం నిల్వలు బయటపడ్డాయి. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా మొత్తం 1012 బస్తాల బియ్యం పట్టుబడ్డట్లు డీఎస్పీ, ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఏ. రమేశ్ వెల్లడించారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు, సంబంధితులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలకు అందాల్సిన ధాన్యాన్ని అక్రమంగా దాచిపెట్టి లాభాపేక్షతో వ్యవహరించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి దందాలను అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఏపీవో రమణ, డీటీ రామకృష్ణ, చెకింగ్ ఇన్స్పెక్టర్ కే. మహేష్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ జి. జంగయ్య, శంషాబాద్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. నర్సింగ్ నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో వి ఓ ఎ(ఊాా) లకు 113 ఉచిత 5+ ఆండ్రాయిడ్ ఫోన్ల పంపిణీ..

- సెల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు
- మహిళా సాధికారతే ఉమ్మడి కూటమి ప్రభుత్వ లక్ష్యం



**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలోని నరసరావుపేట, రొంపిచర్ల మండలాలకు గ్రామ సమాఖ్య సహాయకులు (ఊాా)లకు 113 ఉచిత 5+ ఆండ్రాయిడ్ సెల్ఫోన్లు పంపిణీ చేశారు(ఇందులో నరసరావుపేట మండలం 68, రొంపిచర్ల మండలం 45). స్థానిక గుంటూరు రోడ్లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన వెలుగు కార్యక్రమం గ్రామీణ అభివృద్ధిలో ఎంతో శక్తివంతంగా పని చేసిందన్నారు. మహిళా ఆర్థిక స్వావలంబనకు ఇది బలమైన మార్గం అయిందన్నారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (రాజు-ా) ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుతం 8.5 లక్షల స్వయం సహాయక సంఘాలు (ాం+ం) ఏర్పడి, 89 లక్షల మహిళలు సభ్యులుగా చేరారు. వీరి సమిష్టి పొదుపు రూ.14,500 కోట్లకు చేరుకుంది. కార్పస్ ఫండ్ రూ.16,941.95 కోట్లు, స్త్రీనిధి ద్వారా జీవనోపాధి రుణాలు రూ.21,123.71 కోట్లు విడుదల అయ్యాయి. ఇది దేశంలోని మొత్తం (ఎస్ హెచ్ జి)ాం+ ఫైనాన్సింగ్లో 36% వాటా ఉందని ఆంధ్రప్రదేశ్ సామాజిక-ఆర్థిక సర్వే 2024-25 స్పష్టం చేసిందని తెలిపారు. వెలుగు ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యం గ్రామీణ పేదరిక నిర్మూలన మరియు మహిళా సాధికారత. ప్రతి పేద కుటుంబం సంవత్సరానికి కనీసం రూ.1,00,000 ఆదాయం సాధించేలా మానవ అభివృద్ధి సూచికలు మెరుగుపరచడమే దీని లక్ష్యం. గ్రామ సమాఖ్యల ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాధికారులవుతున్నారు. గత ప్రభుత్వం వి ఓ ఎ(ఊాా)లకు మూడు సంవత్సరాల కాలపరిమితి విధించి వారి సేవలను అస్థిరం చేసింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ కాలపరిమితిని పూర్తిగా రద్దు చేసి, పనితీరు ఆధారంగా వారు నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకుందన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఊాాలు, గ్రామ సమాఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఉచిత ఫోన్లు అందుకున్న ఊాాలు తమ పనితీరు మరింత సమర్థవంతంగా చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు.

## మహిళా భిల్లు వీగిపోవడం వెనుక బీజేపి ద్వంద విధానమే కారణం

జనగణన ప్రాతిపదికన నియోజకవర్గాల సరిహద్దులు తిరిగి ఏర్పాటు చేసే డీలిమిటేషన్ వీగిపోవడం మెజారిటీ ప్రజల విజయం అని స్పష్టం చేసిన సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ పిఓడబ్ల్యూ (విముక్తి) బొనుగుల లలిత, పెర్క సునీత.





**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక ఏప్రిల్ 18 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నరేష్ )** 2023 లో పాసయిన నారీశక్తి వందన్ ఆధినిలయం లోక్ సభలో 33 శాతం రిజర్వేషన్ ను131 వ రాజ్యాంగ సవరణ మహిళా బిల్లు వీగిపోవడానికి కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా బీజేపీ ప్రభుత్వం అనుసరించిన కుట్రపూరిత ద్వందవిధానమే కారణమని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ ప్రగతిశీల మహిళాసంఘం(పిఓడబ్ల్యూ(విముక్తి)) సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులైన బొనుగుల లలిత, పెర్క సునిత స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల లోపల మహిళా రిజర్వేషన్ భిల్లు అమలు జరిగేలా చూడాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. 2026, ఏప్రిల్-18, శనివారం రోజు పంపిన సంయుక్త పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు.131 వ రాజ్యాంగ సవరణ ద్వారా కావాల్సిన 2/3 మెజారిటీ వచ్చి, మహిళా రిజర్వేషన్ భిల్లు పాస్ అయ్యేదని,బీజేపీ కుట్ర రాజకీయలకు వీగిపోయిందని మండిపడ్డారు. 2023 లోనే పాస్ అయిన భిల్లును అమలుచేసే అవకాశం ఉన్నప్పటికీ, కేవలం తమ రాజకీయ ప్రయోజనాలను దృష్టలో పెట్టుకొని అనుసరించిన ద్వంద విధానాల కారణంగా మహిళాభిల్లును అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. తమ వైఫల్యాన్ని ప్రతిపక్ష పార్టీలపై నెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. లోక్ సభలో మహిళా ప్రాతినిద్యాన్ని అడ్డుకున్న బీజేపీకి 2029 ఎన్నికల్లో యావత్ మహిళా లోకం తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. జనగణన డీలిమిటేషన్ తో లింక్ చేయడం వలనే మహిళా రిజర్వేషన్ భిల్లు వీగిపోవడానికి కారణమైందని స్పష్టం చేశారు. వెంటనే మహిళా రిజర్వేషన్ భిల్లు అమలుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరపాలని బొనుగుల లలిత, పెర్క సునిత డిమాండ్ చేశారు. అదేవిధంగా జనగణన ప్రాతిపదికన డీలిమిటేషన్ భిల్లు వీగిపోవడం అనేది మెజారిటీ భారత ప్రజల విజమని అని తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ స్థానంలో మనుగ్రంథాన్ని ప్రవేశపెట్టాలన్న మెజారిటీ మతోన్మాద శక్తులకు చెంపపెట్టుల మనువాదులపై డాక్టర్ బాబాసాహేబ్ అందించిన భారత రాజ్యాంగం సాదించిన ఘన విజమని కొనియాడారు. ఇదే ఐక్యతను చాటుతూ అధికార దుర్వినియోగానికి పాల్పపడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు ఇంటా, భయట బలమైన ఉద్యమ కారణకు పూనుకోవాలని సూచించారు.

## జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ కుమార్ కు శ్రీ సాయి భారత్ వైద్య సేవ సామ్రాట్ ఉత్తమ జాతి సేవా పురస్కారం జయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ డా. పూసపాటి బాలాజీ

**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణములోని ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీ దత్త సాయి అన్నదాన సమాజం మరియు జై జై సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో చిలకలూరిపేట నియోజకవర్గంలోనే పేరు పొందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అరవపల్లి వెంకట సురేష్ కుమార్ కి ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ సాయి భారత్ వైద్య సేవ సామ్రాట్ ఉత్తమ జాతీయ సేవా పురస్కారమును ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పూసపాటి బాలాజీ అందజేశారు.ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండి ప్రజలకు ఎన్నో సేవలు నిర్వహిస్తున్న డాక్టర్ అరవపల్లి సురేష్ కుమార్ అభినందనీయులని , ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇటు ఆస్పత్రికి వచ్చిన పేద లను అతి తక్కువ ఫీజుతో ఆదుకుంటూ అద్భుతమైన వైద్యాన్ని పిల్లలకి అందిస్తూ నియోజకవర్గంలోనే పేరుగాంచారని తెలియజేశారు. అనంతరం సురేష్ కుమార్ మాట్లాడుతూ.. జయ జయ సాయి ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని 15 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా అన్నసంతర్పణ కార్యక్రమం చేస్తూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారని, పలువురు ప్రముఖులను గుర్తించి వారికి తగిన పురస్కారాలు అందిస్తున్నారని వారికి నా అభినందనలు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ పుర ప్రముఖులు అభినందించారు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవరకొండ నాగేశ్వరరావు, కొత్తూరు హనుమంతరావు మానేపల్లి సుధాకర్ తదితర ట్రస్ట్ సభ్యులతో పాటు శిఖాకొల్లి వెంకట రఘునాధ కిషోర్ , మేళ్లచెరువు పవన్ కుమార్, కొప్పురావూరి రామకృష్ణ, మురారి శెట్టి రామకృష్ణ తదితర ప్రముఖులతో పాటు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.





## భౌరంపేట్లో ఘనంగా హిందూ సమ్మేళనం -- ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల సందర్భంగా విశేష స్పందన......



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18 (న్యూస్ ఇండియా ప్రతినిధి)**
ఆర్ఎస్ఎస్ స్థాపనకు వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న శతాబ్ది వేడుకలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు.ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా శ్రీ ఉదయ్ మహారాజ్ స్వామీజీ (యోగధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హిందూ ధర్మ ప్రచారకులు బోధన్) హాజరై ధార్మిక విలువలు, సంస్కృతి పరిరక్షణపై సందేశం ఇచ్చారు.
మహిళా వక్త గా ఉషా ముదిగొండ (రాష్ట్ర సేవికా సమితి, బర్కత్ పూర, భాగ్ ప్రముకులు, భాగ్యనగర్ ఏబీవీపీ వైస్ ప్రెసిడెంట్) హాజరై యువతలో దేశభక్తి, సేవా భావం పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.ముఖ్య వక్తగా గాజుల శివశంకర్ (అర్ ఎస్ ఎస్ ప్రచారకులు, తెలంగాణ ప్రాంతీయ ప్రముకులు) పాల్గొని హిందూ సమాజ ఐక్యతపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు.కార్యక్రమం సందర్భంగా భజనలు, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. స్థానిక యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి మరింత శోభ తీసుకొచ్చారు. గ్రామంలోని వివిధ కాలనీల నుండి వచ్చిన ప్రజలు ఏకమై ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయడం విశేషం.

## ఏ ఎస్ రావు నగర్ లో ఉచిత సమ్మర్ స్కేటింగ్ క్లాసులు



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక ఏప్రిల్ 18 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టీ నరేష్ )**ఈసీఐఎల్, ఏ ఎస్ రావు నగర్ పరిసర ప్రాంతంలో వేసవి సెలవుల్లో పిల్లలకు ఉచిత స్కేటింగ్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు కోచ్ కన్నా గౌడ్ తెలిపారు. ఏఎస్ రావు నగర్ హుడా పార్కులోని స్కేటింగ్ గ్రౌండ్లో నిర్వహించడం జరుగుతుంది. ఎండాకాలంలో సమయం వృధా చేసుకోకుండా ఏదో ఒక ఆక్టివిటీ ఉండాలని ఇది ఒక సువర్ణ అవకాశం అని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6:00 నుంచి 7:00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుంది . మరిన్ని వివరాల కొరకు ఈ నెంబర్ ని సంప్రదించాలని 9949743152 తెలిపారు.

## నవోదయలో 34 మందికి సీట్లు -- యూనివర్సల్ కోచింగ్ సెంటర్ ఘన విజయం..




**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18, న్యూస్ ఇండియా ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం కేంద్రంగా విద్యా సేవలను అందిస్తున్న యూనివర్సల్ కోచింగ్ సెంటర్ మరోసారి విశిష్ట ఫలితాలతో అందరి ప్రశంసలు అందుకుంది. ఇటీవల విడుదలైన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఈ సంస్థ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశేష విజయాన్ని సాధించారు. మొత్తం 34 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయాలలో ఉచిత విద్యకు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కార్పొరేట్ స్థాయి పోటీని తట్టుకుని ఈ విజయాన్ని సాధించడం గమనార్హం. గత ఏడు సంవత్సరాలుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో విద్యా సేవలు అందిస్తున్న ఈ కోచింగ్ సెంటర్, తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను విజయపథంలో నడిపిస్తూ ముందంజలో కొనసాగుతోంది. ఈసారి విజయాన్ని సాధించిన విద్యార్థులలో మోక్షిత్, ప్రణయ్ రాజ్, కె. జయప్రకాశ్, ఎం. వైదిక్, శ్రీఆదిత్యవర్ధన్, ఏ. హర్షిత్ తేజ్, అకిరానందన్, సమన్వీ, రిత్విక్, హిమాన్ష్, తేజశ్విని, మోక్షజ్ఞ, నిహాళ్, ఆశ్వత్, సాయితనీష్, రేహాన్, హర్షిత్, జ్ఞానేష్, త్రివిక్రమ్, ఎన్. రిత్విక్, సాత్విక్, మోక్ష, అనీష్, సాయిప్రణవ్, వర్షిణి, చిత్రిక్, శ్రీమహా, వైష్ణవి, గౌతమ్, వంధన, చరణ్ తేజ్, గౌతమ్ వర్మ, ప్రణయ్ కుమార్, అభినయా తదితరులు ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను శాలువాలతో సత్కరించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో అభినందనలు తెలిపారు. ఈ విజయంతో సంస్థపై తల్లిదండ్రుల విశ్వాసం మరింత పెరిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎ. బాలరాజ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని తెలిపారు. సరైన మార్గదర్శకత్వం, క్రమశిక్షణ, నమ్మకం ఉంటే విద్యార్థులు ఏ స్థాయికైనా ఎదగగలరని చెప్పారు. ఈ సంవత్సరం 34 మంది విద్యార్థులు నవోదయలో సీట్లు సాధించడం తమకు గర్వకారణమని అన్నారు. ఉపాధ్యాయుడు ధనంజయ్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, ఆ ప్రతిభను గుర్తించి సరైన దిశలో నడిపించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. పాఠ్యాంశాలతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పోటీ భావన పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించిన నవోదయ, సైనిక్ కోచింగ్ తరగతులు మే రెండో వారంలో ప్రారంభమవుతాయని, ఆసక్తి గల విద్యార్థులు ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6302224279, 8885481117 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## అందరి క్షేమాన్ని కోరుకునేది హిందూ ధర్మం

- 26న భారీ ఎత్తున హిందూ సమ్మేళనం సభ
- విద్యానగర్ నుంచి పాలకేంద్ర వరకు బైక్ ర్యాలీ




**భద్రాద్రి కొత్తగూడెం (న్యూస్ ఇండియా ప్రతినిధి)ఏప్రిల్ 18**:కొత్తగూడెం వనవాసిలో హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.హిందూ ధర్మం, సంస్కృతి మరియు సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉన్న హిందూ సమాజం ఆధ్వర్యంలో ఏప్రిల్ 26, సాయంత్రం 4:00 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో భారీ ఎత్తున హిందూ సమ్మేళన సభ నిర్వహించనున్నారు . ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ..ఈ సమ్మేళనం ప్రధాన లక్ష్యం హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడం, యువతలో ధార్మిక మరియు సాంస్కృతిక అవగాహన పెంపొందించడం, అలాగే మన సంప్రదాయ విలువలను భవిష్యత్ తరాలకు చేరవేయడం అని, ఈ కార్యక్రమంలో ప్రముఖ ధార్మిక నేతలు, సామాజిక కార్యకర్తలు, పండితులు పాల్గొని హిందూ ధర్మం, సంస్కృతి మరియు ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న సవాళ్లపై ఉపన్యాసాలు అందించనున్నారు. కార్యక్రమంలో భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు మరియు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. విద్యానగర్ సాయిబాబా టెంపుల్ వద్ద నుంచి పాలకేంద్ర హనుమాన్ టెంపుల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా హిందూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వర్ధన్ రావు, సెక్రెటరీ జగన్మోహన్ రావు, ఎలదండి పూర్ణచంద్రరావు,
గోపాల పచార్య, బండి భాస్కర్, దారా రమేష్, పాతూరి విఠల్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లి పట్టణం మున్సిపల్ ఆఫీస్ నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం మరియు తారకరామా సాగర్ నందు పూడికతీత కార్యక్రమం లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ

**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు వద్ద స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గత ప్రభుత్వంలో చెత్త పై పన్ను వేశారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్త పై పన్ను తొలగించారు

స్వచ్ఛాంధ్రకోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

పారిశుద్ధ్య కార్మికులకు కోటి ప్రమాద బీమా కూటమి ప్రభుత్వం కల్పిస్తుంది

ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ డబ్బాల నివారణకు స్వచ్ఛందంగా ప్రజలు చైతన్యంతో కట్టడి చేయాలి

కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి

కాల్వలు, చెరువులు, చెక్ డ్యాంలు బాగు చేసుకోవాలి.. నీటి నిల్వకు సిద్ధంచేయాలి.

భూగర్భ జలాలు పెంచడంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి.

నీటి భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత. నీటి వనరులను పరిరక్షించడం, నీటి కాలుష్యాన్ని నివారించడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేయడం వంటి చర్యలు తీసుకోవాలి.

నీటి భద్రతను కల్పించడం ద్వారా, సుస్థిరమైన నీటి సరఫరాను అందించగలవు, పర్యావరణాన్ని రక్షించగలవు మరియు భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడగలవు.

నీటి భద్రత అంటే నీటి వనరులను సురక్షితంగా మరియు సమర్థవంతంగా ఉపయోగించడం,




నేను, నా పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తానని, నా వంతు కృషిగా స్వచ్ఛత కార్యక్రమాల కొరకు శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటానని, ఈ రోజు పరిశుభ్రత గురించి నేను వేసిన ఈ ముందడుగు ఆంధ్ర రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుటలో సహాయం చేస్తుందని నమ్ముతూ, ఈరోజు నుండి నా తోటి వారికి కూడ "స్వచ్ఛత" పై అవగాహన కల్పించే దిశగా ప్రయత్నిస్తానని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన, సుభిక్షమైన, ఆనందకరమైన ఆంధ్ర రాష్ట్రాన్ని నిర్మించడానికి, నాతో మొదలైన ఈ నిర్ణయం ద్వారా నా రాష్ట్రాన్ని "స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర" గా తీర్చిదిద్దేటట్లు నా వంతు కృషి చేస్తానని ప్రతి ఒక్కరి చేత ప్రతిజ్ఞ చేయించారు

ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు మరియు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితి నుంచి ప్రాణం దక్కింది..



అత్యాధునిక న్యూరో క్రిటికల్ కేర్‌తో 40 ఏళ్ల రోగిని కాపాడిన యశోదా వైద్యులు..

**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18, న్యూస్ ఇండియా ప్రతినిధి:**
ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిన ఓ 40 ఏళ్ల వ్యక్తి ప్రాణాలను వైద్యులు సమయోచితంగా స్పందించి కాపాడిన ఘటన వైద్య రంగంలో మరోసారి ఆశాజ్యోతి నింపింది. మలక్‌పేట్ లోని యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో అత్యాధునిక న్యూరో క్రిటికల్ కేర్, నిపుణుల సమన్వయంతో ఈ అరుదైన కేసును విజయవంతంగా నిర్వహించారు.

ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, అధిక వాంతులతో బాధపడుతున్న రోగిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే పరీక్షలు నిర్వహించగా, మెదడులో ఎడమ సెరెబెల్లం భాగంలో రక్తస్రావం, మాస్ ఎఫెక్ట్, స్వల్ప హైడ్రోసెఫలస్ ఉన్నట్లు సీటీ స్కాన్‌లో తేలింది. ఇటువంటి కేసుల్లో చికిత్సలో కాస్త ఆలస్యం జరిగినా ప్రాణాలకు ముప్పు తప్పదని వైద్యులు తెలిపారు.

సవాల్‌గా మారిన చికిత్స

రోగికి ముందుగానే క్రానిక్ రుమాటిక్ హార్ట్ డిసీజ్, తీవ్రమైన మైట్రల్ స్టెనోసిస్, మైట్రల్ రిగర్జిటేషన్ వంటి గుండె సమస్యలు ఉండటంతో పాటు యాంటికోగ్యులెంట్ మందులు వాడటం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ఈ నేపథ్యంలో న్యూరో, కార్డియాలజీ, క్రిటికల్ కేర్ నిపుణులు కలిసి మల్టీడిసిప్లినరీ విధానంలో చికిత్స అందించారు. యాంటికోగ్యులెంట్ మందులను వెంటనే నిలిపివేయడం, రక్తస్రావాన్ని నిరంతరం పర్యవేక్షించడం, మెదడు వాపు తగ్గించే చికిత్సలు, ఫిట్స్ నివారణ చర్యలు, రక్త గడ్డకట్టే లోపాలను సరిచేయడం వంటి చర్యలను సమాంతరంగా అమలు చేశారు. ఐసీయూలో నిరంతర పర్యవేక్షణలో రోగిని ఉంచి జాగ్రత్తగా కన్జర్వేటివ్ విధానంలోనే చికిత్స కొనసాగించారు.

శస్త్రచికిత్స లేకుండానే విజయవంతం

సీనియర్ న్యూరో సర్జన్ డా. శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలో వైద్య బృందం సమయానికి తీసుకున్న నిర్ణయాలతో శస్త్రచికిత్స అవసరం లేకుండానే రోగి క్రమంగా కోలుకున్నాడు. పూర్తి స్పృహకు రావడం, ఆదేశాలకు స్పందించడం, చేతులు కాళ్లు సాధారణంగా కదలించడం వంటి లక్షణాలు కనిపించడంతో వైద్యులు ఉపశమనం పొందారు. అనంతరం పూర్తిగా కోలుకున్న రోగిని డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యుల మాట్లాడుతూ.. సెరెబెల్లార్ హీమరేజ్ అత్యంత ప్రమాదకరమైనదని, సమయానికి నిర్ధారణ, నిరంతర పర్యవేక్షణ ఉంటేనే ప్రాణాలు కాపాడగలమని డా. శ్రీనివాస్ బొట్ల తెలిపారు. అలాగే గుండె సమస్యలతో కూడిన కేసుల్లో చికిత్స మరింత క్లిష్టమవుతుందని, సమన్వయ వైద్య విధానం కీలకమని కార్డియాలజిస్ట్ డా. సంతోష్ కుమార్ పేర్కొన్నారు. తీవ్రమైన తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చు. అత్యాధునిక న్యూరో క్రిటికల్ కేర్, నిపుణుల సమన్వయం ఉంటే క్లిష్ట పరిస్థితులనూ విజయవంతంగా ఎదుర్కొనడం సాధ్యమే.

## ఏ ఎస్ రావు నగర్ లో ఉచిత సమ్మర్ స్కేటింగ్ క్లాసులు



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక ఏప్రిల్ 18 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టీ నరేష్ )**ఈసీఐఎల్, ఏ ఎస్ రావు నగర్ పరిసర ప్రాంతంలో వేసవి సెలవుల్లో పిల్లలకు ఉచిత స్కేటింగ్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు కోచ్ కన్నా గౌడ్ తెలిపారు. ఏఎస్ రావు నగర్ హుడా పార్కులోని స్కేటింగ్ గ్రౌండ్లో నిర్వహించడం జరుగుతుంది. ఎండాకాలంలో సమయం వృధా చేసుకోకుండా ఏదో ఒక ఆక్టివిటీ ఉండాలని ఇది ఒక సువర్ణ అవకాశం అని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6:00 నుంచి 7:00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుంది . మరిన్ని వివరాల కొరకు ఈ నెంబర్ ని సంప్రదించాలని 9949743152 తెలిపారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర చెరువులు ప్రక్షాళన



తుంగపాడులో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం లోని రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర చెరువులు ప్రక్షాళన మరియు పునరుద్ధారణ ప్రణాళికలు, సమీక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. చెరువుల శుభ్రత, నీటి నిల్వ సామర్థ్యం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ఆధ్వర్యంలో ఈ సమీక్ష జరిగింది. కార్యక్రమంలో చెరువుల ప్రక్షాళన, పునరుద్ధరణకు సంబంధించిన వివిధ ప్రణాళికలను ఎమ్మెల్యే సమీక్షించారు. అధికారులు సాధ్యాసాధ్యాలు, అంచనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ.. చెరువులు ప్రజల జీవనాధారం అని, వాటి సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తుంగపాడు గ్రామం సహా నియోజకవర్గంలోని అన్ని చెరువులు సకాలంలో పునరుద్ధరించి, వ్యవసాయం, తాగునీటి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామవాసులు పాల్గొన్నారు.



పవర్‌ఫుల్ గ్లామ్ అప్పీల్‌తో రీగల్ లెహంగా లుక్‌లో నుష్రత్ భరుచ్చా స్టన్స్

# రానా దగ్గుపాటి : టాలీవుడ్ హీరోలు టీచర్లు అయితే ఏ సబ్జెక్ట్ చెబుతారో తెలుసా?



టాలీవుడ్ భల్లాలదేవ రానా దగ్గుబాటి అంటే కేవలం నటన మాత్రమే కాదు, తనదైన చమత్కారంతోనూ అందరినీ ఆకట్టుకుంటారు. గతం లో ఒక మూవీ ఫంక్షన్‌లో యాంకర్ సుమ అడిగిన ప్రశ్నలకు రానా అదిరిపోయే సమాధానాలు ఇచ్చారు. మన టాలీవుడ్ స్టార్ హీరోలు ఒకవేళ టీచర్లు అయితే ఏ సబ్జెక్టులు బోధిస్తారనే అంశంపై రానా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ సరదా ముచ్చట్లు ఏంటో ఒకసారి చూద్దాం..

**రాజమౌళి – ఆల్ ఇన్ వన్ టీచర్:**

దర్శకధీరుడు రాజమౌళి గురించి రానా చెబుతూ.. ఆయన అన్ని సబ్జెక్టులు నేర్పించగల సమర్థుడని పేర్కొన్నారు. స్కూల్ అయిపోయాక సాయంత్రం వేళ మనం వెళ్లే 'స్పెషల్ ట్యూషన్ టీచర్' లాగా రాజమౌళి గారు ఉంటారని చమత్కరించారు. అంటే ఏ సందేహం వచ్చినా, ఏ విషయంలోనైనా క్లారిటీ ఇవ్వడంలో రాజమౌళి తర్వాతే ఎవరైనా అని రానా ఉద్దేశ్యం. సినిమా అనే స్కూల్‌లో ఆయన ఒక హెడ్ మాస్టర్ లాంటి వారని రానా మాటలను బట్టి అర్థమవుతోంది.

**చరణ్, ప్రభాస్‌ల స్పెషల్ క్లాసులు:**

ఇక రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ.. చరణ్‌కు గుర్రపు స్వారీ అంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయన అందరికీ 'హార్స్ రైడింగ్' నేర్పిస్తే బాగుంటుందని రానా చెప్పారు. అలాగే గ్లోబల్ స్టార్ ప్రభాస్ గురించి చెబుతూ.. ఆయన బిహేవియరల్ అండ్ కల్చరల్ క్లాసులు తీసుకోవాలని సూచించారు. అందరితో ఎంతో మర్యాదగా, ప్రేమిస్తూ, హ్యాపీగా ఎలా ఉండాలో ప్రభాస్ కంటే బాగా ఎవరూ నేర్పించలేరని రానా కొనియాడారు. డార్లింగ్ వ్యక్తిత్వం అలాంటిది మరి.

**అనుష్క మంచితనం.. ఎన్టీఆర్ తెలుగు:**

అనుష్క శెట్టి గురించి రానా చెబుతూ ఒక ఆసక్తికరమైన ఉదాహరణ ఇచ్చారు. జపాన్‌లోని స్కూల్స్‌లో పిల్లలకు మనుషులతో ఎలా మాట్లాడాలి, ఇల్లు ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి వంటి లైఫ్ స్కిల్స్ నేర్పిస్తారని, అలాంటి 'మంచితనం' నేర్పించడానికి అనుష్క సరైన వ్యక్తి అని చెప్పారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే, ఆయన 100% పక్కా 'తెలుగు టీచర్' అని రానా తేల్చేశారు. తారక్ మాట్లాడే స్వచ్ఛమైన తెలుగును వింటే ఎవరైనా సరే ఆయనకు ఈ సబ్జెక్ట్ ఇచ్చేయాల్సిందే. ఒక చిన్న రాపిడ్ ఫైర్ రౌండ్‌లో రానా చెప్పిన ఈ విషయాలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి హీరో వ్యక్తిత్వానికి, వారికున్న ఇష్టాలకు అనుగుణంగా రానా సబ్జెక్టులను ఎంచుకున్న తీరు చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. "రానా గారు పక్కాగా గెస్ చేశారు" అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వర్షం కురుస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, తన తోటి నటీనటుల గురించి రానాకు ఉన్న అవగాహన చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈ వీడియో మీరు కూడా చూశారా? ముగింపుగా చెప్పాలంటే.. మన స్టార్ హీరోలు ఒకవేళ నిజంగా టీచర్లు అయితే ఆ స్కూల్స్ అన్నీ హౌస్ ఫుల్ అవ్వడం ఖాయం!



హెబ్బా పటేల్ సొగసైన బ్లాక్ లేస్ లుక్‌లో మెరిసింది

# ప్రభాస్ తర్వాత ఈ హీరో ఒక్కడికే ఆ ఛాన్స్!



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రస్తుతం పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ తర్వాత ఆ స్థాయి భారీ ప్రాజెక్టులతో.. పక్కా ప్రణాళికతో దూసుకుపోతున్న ఏకైక హీరోగా రణబీర్ కపూర్ నిలుస్తున్నారు. రణబీర్ ప్రస్తుతం నటిస్తున్న ఐదు చిత్రాలను పరిశీలిస్తే..ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా అత్యంత వైవిధ్యమైన కంటెంట్ తో రూపొందుతున్నాయి. నటుడిగా తనలోని భిన్న కోణాలను ఆవిష్కరించుకునేందుకు అతడు సిద్ధమవుతున్న తీరు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో వస్తున్న -లవ్ అండ్ వార్- చిత్రంలో రణబీర్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారనే వార్త సినిమాపై అంచనాలను పెంచేసింది. మరోవైపు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న -రామాయణం- చిత్రం ఇందుకు పూర్తి భిన్నమైనది. ఇందులో రణబీర్ పరమ పవిత్రమైన, ఆదర్శవంతమైన శ్రీరాముడి పాత్రలో నటిస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి రామాయణం మొదటి భాగం.. వచ్చే ఏడాది దీపావళికి రెండో భాగం విడుదల కానున్నాయి. విశేషం ఏమిటంటే.. ఈ రెండు ఆధ్యాత్మిక చిత్రాల మధ్యలో జనవరి చివరి వారంలో నెగెటివ్ షేడ్ ఉన్న -లవ్ అండ్ వార్- విడుదల కానుంది. ఒకే సమయంలో ఆదర్శప్రాయమైన దైవ సమానమైన పాత్రలోనూ... రాక్షస ప్రవృత్తి ఉన్న పాత్రలోనూ కనిపించడం రణబీర్ తీసుకున్న అతిపెద్ద సవాలుగా భావించవచ్చు. కేవలం ఇవే కాకుండా.. రణబీర్ తదుపరి చిత్రాల ఎంపిక కూడా ఉత్కంఠను కలిగిస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న -యానిమల్ పార్క్- (యానిమల్ సీక్వెల్) 2028లో విడుదల కానుంది. ఇది ఒక పక్కా సోషల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను రక్తి కట్టించనుంది. ఆ తర్వాత సోషియో-ఫాంటసీ జోనర్‌లో -బ్రహ్మాస్త్ర పార్ట్ 2స- రాబోతోంది. ఇలా వరుసగా ఐదు చిత్రాల్లో ఐదు విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలను పోషిస్తూ.. రణబీర్ తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఒకే తరం ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించడమే అతడి లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఒక పాత్రలో శ్రీరాముడిగా చూసిన ప్రేక్షకులే.. మరో సినిమాలో మరో పాత్రలో నెగెటివ్ షేడ్స్‌లో చూడగలరా? అనే సందేహాలు కొందరిలో వ్యక్తమవుతున్నాయి. పరిణతి చెందని ఒక సెక్షన్ రాముడిగా చూసిన తర్వాత అతడిని రాక్షసుడిగా చూడలేమని వాదిస్తున్నా.. మెజారిటీ సినీ విశ్లేషకులు మాత్రం నటుడు ఎల్లపుడూ అన్ని రకాల పాత్రల్లోనూ మెప్పించాలని అభిప్రాయపడుతున్నారు. పాత్రకు, నటుడికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అర్థం చేసుకునే స్థాయికి నేటి ప్రేక్షకులు చేరుకున్నారని విశ్లేషిస్తున్నారు. రణబీర్ ప్రతి ఎంపికా అతడిలోని నటనా వైవిధ్యాన్ని నిరూపించడానికి ఒక గొప్ప వేదిక. ఈ క్రమంలో రణబీర్ కపూర్ భారతీయ దిగ్గజ నటుల బాటలో నడుస్తున్నారని చెప్పవచ్చు. గతంలో నవరస నటసార్వభౌముడు ఎన్టీఆర్ వంటి వారు ఒకే సినిమాలో హీరోగానూ, విలన్‌గానూ నటించి మెప్పించారు. ఒకే చిత్రంలో నాలుగైదు పాత్రల్లో నటించిన ఘనత లెజెండరీ ఎన్టీఆర్ కి ఉంది. జానపద, పౌరాణిక చిత్రాల్లో రాముడిగా అలరించి, అదే సమయంలో రావణుడిగా, దుర్యోధనుడిగాను అదరగొట్టిన ఘనత అన్నగారిది. నేటితరం హీరోలు కూడా అదే స్ఫూర్తితో అన్ని రకాల పాత్రలను పోషించి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటాల్సి ఉంటుంది. రణబీర్ కపూర్ ఎంచుకున్న ఈ మార్గం అతడిని భారతీయ చిత్ర పరిశ్రమలో బిగ్గెస్ట్ కాంపిటీటర్‌గా నిలబెడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com